



శ్రీకాకుళం: దూదివారి కోవెలలో పూజలు



శ్రీకాకుళం: పొట్టి శ్రీరాములు జంక్షన్‌లో భోగి మంట వద్ద యువకుల సందడి



శ్రీకాకుళంలోని పొట్టిశ్రీరాములు మార్కెట్‌లో కొనుగోలుదారుల రద్దీ

ఊరూరా భోగి మంటలు

- ఉత్సాహంగా జరుపుకున్న జిల్లా వాసులు
- దేవాలయాల్లో ప్రత్యేక పూజలు
- నేడు మకర సంక్రాంతి పర్వదినం



శ్రీకాకుళం: న్యూకాలనీలో..

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లావాసులు భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతిని పురస్కరించుకుని వలసజీవులంతా స్వగ్రామాలకు చేరుకోవడంతో పల్లెలు కళకళలాడాయి. సోమవారం వేకువజామున శ్రీకాకుళంలో సూర్యమహల్, డేఅండ్ నైట్, న్యూకాలనీ, పొట్టిశ్రీరాములు, ఏడురోడ్ల జంక్షన్లతోపాటు తదితర ప్రాంతాల్లో భోగి వేడుకలు నిర్వహించారు. గ్రామాలు, పట్టణాల్లో చిన్నారులు, పెద్దలు అంతా కలిసి భోగిమంటలు వేశారు. కొత్తవస్త్రాలు ధరించారు. ఆలయాల్లో గోదాదేవి కల్యాణం, పూజలు చేశారు. చిన్నారులకు భోగి పళ్లు పోసి పెద్దలు ఆశీర్వదించారు. అలాగే మంగళవారం మకర సంక్రాంతి వేడుకలకు జిల్లావాసులు సన్నద్ధమవుతున్నారు. పితృదేవతలకు పూజలు చేశాక కొత్త వస్త్రాలను ధరించనున్నారు. ఈ మేరకు సంక్రాంతి పూజా సామగ్రి, కూరగాయలు, కిరాణా సరుకుల కొనుగోలుదారులతో శ్రీకాకుళంలోని పొట్టిశ్రీరాములు మార్కెట్ కిటకిటలాడింది.



శ్రీకాకుళం : సూర్యమహల్ జంక్షన్ వద్ద..



నిమ్మాడలో గ్రామస్థులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం

- మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, జనవరి 13: స్థానిక సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యమిస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా సోమవారం నిమ్మాడలో గ్రామస్థులతో ఆయన ముచ్చటించారు. స్వగ్రామాల్లో సంక్రాంతి వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సిరిసంపదలతో తుల తూగాలని ఆకాంక్షించారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కింజరాపు హరివరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'పాలవలస' కన్నుమూత


- అనారోగ్యంతో మాజీ ఎంపీ రాజశేఖరం మృతి
- కాంగ్రెస్‌తోనే రాజకీయ ప్రస్థానం ● 2011 నుంచి వైసీపీలో..



రాజశేఖరం (ఫైల్)

శ్రీకాకుళం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మాజీ రాజ్యసభ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే, శ్రీకాకుళం జిల్లాపరిషత్ మాజీచైర్మన్ పాలవలస రాజశేఖరం(77) సోమవారం మృతిచెందారు. కొన్నాళ్లుగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. శ్రీకాకుళంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఈయనకు భార్య ఇందుమతి, కుమారుడు విక్రాంత్, కుమార్తె శాంతి ఉన్నారు. కుమారుడు పాలవలస విక్రాంత్ వైసీపీ ఎమ్మెల్సీగా ఉన్నారు. కుమార్తె రెడ్డి శాంతి 2019లో వైసీపీ నుంచి పాతపట్నం ఎమ్మెల్యేగా సేవలందించారు. రాజశేఖరం మృతిపై జిల్లా కు చెందిన ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

● పాలవలస రాజశేఖరం రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ పార్టీలోనే అత్యధికంగా సాగింది. రాజశేఖరం స్వగ్రామం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పాలకొండ నియోజకవర్గం వీరఘట్టం మండలం నీలానగరం. ఈయన తండ్రి పాలవలస సంగంనాయుడు (మిగతా 8వ పేజీలో..)



బెండికొండ మాది!

- కబ్జా చేసేసిన వైసీపీ నాయకులు
- భూముల చుట్టూ కంచె వేసిన వైనం
- పట్టించుకోని అటవీ, రెవెన్యూ శాఖలు
- కూటమి ప్రభుత్వం ఉన్నా చర్యల్లేవ్

వజ్రపుకొత్తూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి సమీపాన.. పలాస- కాశీబుగ్గ మార్కెట్‌కు కూతవేటు దూరంలో ఉన్న బెండి కొండపై వందలాది ఎకరాల భూమి ఆక్రమణకు గురవుతోంది. రూ. కోట్లు విలువ చేసే ఈ భూమిపై కొంతమంది వైసీపీ నాయకుల కన్ను పడింది. ఈ క్రమంలో స్థానిక వైసీపీ నాయకులతోపాటు ప్రైవేటు వ్యక్తులు కూడా భూమి చుట్టూ కంచె వేస్తూ.. ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఆపై సెంటు రూ.లక్షకుపైగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు మాత్రం చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాం నుంచీ ఆక్రమణలు కొనసాగుతున్నా.. ఒక్కరోజు కూడా పరిశీలించిన దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● అధికారుల సమన్వయలోపం..

బెండికొండ భూములు.. అటవీ, రెవెన్యూ శాఖల పరిధిలో ఉన్నాయి. రెండు శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఆక్రమణ దారులు యథేచ్ఛగా ఇక్కడ భూములు కబ్జా చేస్తున్నారు. పూండి పరిసర గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు బెండి వద్ద భూములను అధికంగా ఆక్రమించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఓ విశ్రాంత ఆర్మీ ఉద్యోగికి ప్రభుత్వం ఇక్కడ గతంలో స్థలం కేటాయించింది. ఆ స్థలానికి చుట్టు పక్కలా ఐదారు రెట్లు ఆ విశ్రాంత ఆర్మీ ఉద్యోగి ఆక్రమించుకున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే ఒక నాయకుడు సర్వే నెంబర్లు మార్చి తన కుటుంబ సభ్యుల పేరుమీద సుమారు 15ఎకరాలు ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

● గురుకుల పాఠశాలకు కేటాయించినా..

టీడీపీ ప్రభుత్వ హయాంలో(2014- 2019 మధ్య) ఈ ప్రాంతంలో ప్రభుత్వ గురుకుల పాఠశాల నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు అప్పట్లో బెండికొండపై 15 ఎకరాల స్థలాన్ని జిల్లా అధికారులు కేటాయించారు. కాగా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. తర్వాత అధికారం (మిగతా 8వ పేజీలో..)



ఆక్రమణకు గురైన బెండికొండ భూములు



సంక్రాంతి వ్యాపారం కళకళ

- ప్రధాన పట్టణాల్లో కిటకిటలాడిన దుకాణాలు
- రూ.కోట్లలో వస్త్ర, కిరాణా, ఇతర లావాదేవీలు
- ఆన్‌లైన్‌లోనూ అదేజోరు

8లో



సంగమేశ్వరాలయం

ప్రకృతి సోయగాలు.. చరిత్ర ఆనవాళ్లు

- నేటి నుంచి సంగమేశ్వరుని జాతర
- తరలిరానున్న వేలాది మంది భక్తులు

8లో

ఆధ్యాత్మిక పరిమళం.. ఏకశిలా పర్వతం

- నేటి నుంచి మెట్టవలస పర్వతంపై ఉత్సవాలు

8లో

మొగలి పరిమళాలు ఏవీ?



పెద్దలక్ష్మీపురంలో మొగలిపూల సాగు..

- జిల్లాలో తగ్గిన పూల ఉత్పత్తి
- అంతంతమాత్రంగానే సేకరణ
- ఆందోళనలో రైతులు

ఇచ్ఛాపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది మొగలి ఉత్పత్తి పూర్తిగా పడిపోయింది. ఏటా జూన్ నుంచి జనవరి వరకూ మొగలి పూలు సేకరిస్తారు. రైతులతోపాటు సేకరించే వారికి కొంత డబ్బులు గిట్టుబాటయ్యేవి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా కనీసస్థాయిలో మొగలిపూల సాగు ఆశాజనకంగా లేదు. కనీసస్థాయిలో కూడా సేకరణ లేక తమకు ఉపాధి కరువైందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

● మూతపడుతున్న బట్టీలు..

ఉద్దానంలో మొగలి పూలు ఎక్కువగా సేకరిస్తుంటారు. అత్తరు, సుగంధ ద్రవ్యం తయారీలో మొగలి పూలను వినియోగిస్తారు. అందుకే ఉద్దానం వ్యాప్తంగా అప్పట్లో మొగలి నుంచి రసాయనం తీసే పరిశ్రమలు వెలిశాయి. కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకొని వందలాది మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందేవారు. బట్టీలుగా పిలుచుకునే పరిశ్రమల వద్ద భారీ సైజులో ఉండే రాగిపాత్రలో మొగలి పువ్వులు మరిగించి ఆవిరి రూపంలో రసాన్ని తీస్తారు. ఈ రసాన్ని మరో రాగిపాత్రలో నిల్వచేస్తారు. అత్తరు తయారీతో పాటు అగరవత్తుల తయారీలో ఎక్కువగా వినియోగిస్తారు. సాధారణ రోజుల్లో మొగలి రసం లీటరు రూ.2లక్షల వరకూ పలుకుతుంది. సీజన్‌లో అయితే రూ.3 లక్షల వరకూ పలుకుతుందని స్థానికులు చెబుతున్నారు. బరంపురం, భువనేశ్వర్, జైపూర్, కలకత్తా వంటి ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడకు వచ్చి పువ్వులతో పాటు రసాన్ని కొనుగోలు చేస్తుంటారు. కానీ ఈ ఏడాది సేకరణ లేకపోవడంతో వ్యాపారులు కూడా కనిపించడం లేదు. ఏటా దాదాపు 100 లారీల లోడ్ల వరకూ తరలించగా.. ఈ ఏడాది మాత్రం 30 లోడ్లు కూడా వెళ్లలేదని తెలుస్తోంది.

● ఇదీ పరిస్థితి..

జిల్లావ్యాప్తంగా తీర ప్రాంతాల్లో మొగలి పంట విస్తారంగా ఉండేది. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, పలాస, సంతబొమ్మాళి, శ్రీకాకుళం రూరల్, గార మండలాల్లో మొగలి సాగు అధికం. తీర మండలాల్లో దాదాపు 6వేల హెక్టార్లలో మొగలి సాగవుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఉద్దానంలో కొబ్బరి అంతర పంటగా ఎక్కువగా సాగవుతోంది. పొలాలకు కంచె వేసే క్రమంలో మొగలిని నాటుతుంటారు. ఇవి క్రమేపీ పెరుగుతుంటాయి. పొలం గట్లతో పాటు తీర ప్రాంతానికి మొగలి చెట్లు ఒక రక్షణ కవచంలా ఉంటాయి. అయితే తుఫాన్లకు, ఈదురుగాలులకు ఇవి నేలకొరుగుతున్నాయి. ప్రభుత్వం పంటల జాబితాలో చేర్చకపోవడంతో వీటికి పరిహారం కూడా దక్కడం లేదు. కనీసం రైతులకు సాగు సూచనలు కూడా ఇవ్వడం లేదు.

● సేకరణ చాలా కష్టం..

ఏడాదిలో ఆరు నెలలపాటు మొగలి పువ్వులు ఉత్పత్తినిస్తాయి. ఏటా జూన్ నుంచి జనవరి వరకూ వీటిని ఎక్కువగా (మిగతా 9వ పేజీలో..)

● ఉపాధి లేదు

ఈ ఏడాది ఉపాధి లేకుండా పోయింది. కనీస స్థాయిలో కూడా ఉత్పత్తి లేదు. వర్షాభావ పరిస్థితులతో మొగలి పువ్వులు దొరకలేదు. ఏటా వంద లారీలోడ్లకుపైగా కవిటి, కంచిలి నుంచి వెళ్లేవి. కానీ ఈ ఏడాది 30 లోడ్లలోపే వెళ్లాయి.

- పులకల రామారావు, పెద్దలక్ష్మీపురం, మొగలి రైతు



శ్రీకాకుళం కల్చరల్: న్యూ కాలనీలో భోగి మంట వద్ద సందడి

భోగి సందడి

- జిల్లా వ్యాపంగా వేడుకలు
- ఘనంగా గోదారంగనాథుల కల్యాణం

జిల్లాలో సోమవారం భోగి పండగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ప్రతిఒక్కరూ తలస్నాన మాచరించి భోగి మంట వేశారు. ముందుగా తయారుచేసిన పిడకలను భోగి మంటల్లో వేశారు. సాయంత్రం చిన్నారుల తలపై తల్లిదండ్రులు భోగి పండ్లు పోసి బాలరిష్టాలు పోయి ఆరోగ్యంగా ఉండాలని దీవించారు. రణస్థలం మండలం కొండములగాంలో 150 అడుగుల పిడకల దండను చిన్నారులు, పెద్దలు కలిసి భోగి మంటలో వేశారు. కంచిలిలో చిన్న పిల్లలను రాధాకృషులుగా ముస్తాబుచేసి చేసి గొబ్బి పూజ చేశారు. అలాగే ధనుర్మాస ఉత్సవాలు ముగింపు సందర్భంగా పలు ఆలయాల్లో గోదాదేవి రంగనాథుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

– ఆంధ్రజ్యోతి బృందం



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శివబాలాజీ ఆలయంలో గోదారంగనాథులకు పూలతో అలంకరణ



రణస్థలం: కొండములగాంలో భోగి మంటలో పిడకల దండలు వేస్తున్న దృశ్యం



ఇచ్ఛాపురం గాంధీ మండపం వద్ద..



పలాస: రైల్వే మైదానం వద్ద..



టెక్కలి: లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం



కంచిలి: గొబ్బెమ్మ పూజలో పాల్గొన్న చిన్నారులు, మహిళలు

సంక్రాంతి వ్యాపారం కళకళ

ప్రధాన పట్టణాల్లో కిటకిటలాడిన దుకాణాలు

రూ.కోట్లలో వస్త్ర, కిరాణా, ఇతర వ్యాపారాలు

అదేజోరులో ఆన్‌లైన్ బిజినెస్ కూడా..

నరసన్నపేట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వ్యాపారం కళకళలా డింది. ఓవైపు ఇళ్ల, వాకిళ్లను అలంకరించే పనిలో ప్రజలు నిమగ్నమ వుతూనే.. మరోవైపు షాపింగ్‌లోనూ మునిగి తేలారు. గడచిన వారం రోజులుగా శ్రీకాకుళంతో పాటు ఇతర పట్టణాల ప్రధాన రోడ్లు రద్దీగా కనిపించాయి. వ్యాపార దుకాణాలు కిటకిటలాడాయి.



నరసన్నపేట: ఓ వస్త్ర దుకాణంలో రద్దీ

వస్త్ర వ్యాపారమే టాప్..

సంక్రాంతి వ్యాపారాలు ఈ ఏడాది జోరుగా సాగాయి. ఈ సీజన్‌లో జరిగే వ్యాపారాల్లో అగ్రస్థానం వస్త్రాలదే. ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లాలో సుమారు రూ.300 కోట్ల వరకు వ్యాపారం సాగింది. పంటలు బాగా పండటంతో వస్త్రాల విక్రయాలు జోరందుకున్నాయి. శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం వంటి పట్టణాల్లో షాపింగ్‌మాల్స్ వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. వీటితో పాటు చెప్పులు, ఇతర అలంకరణ వస్తువులకూ భారీగా గిరాకీ ఏర్పడింది. గేమ్‌చేంజర్, డాకు మహారాజ్ వంటి కొత్త సినిమాల రాకతో థియేటర్లకూ వ్యాపార కళ వచ్చింది.

కిరాణా షాపులకు రెట్టింపు...

సాధారణ రోజుల కంటే సంక్రాంతి రోజుల్లో సామాన్యుడు కూడా తన స్థోమతను బట్టి ఇంటిలో రకరకాల వంటలు చేయడంతో కిరాణా వ్యాపారం రెండింతలు పెరుగుతుంది. ఈ ఏడాది కిరాణా షాపుల్లో కొందరు వ్యాపారులు నూనె, బెల్లం వంటి వస్తువుల కొనుగోలుకు బహుమతులు అందజేస్తున్నారు. సంక్రాంతి సీజన్‌లో సుమారు రూ.100 కోట్ల వరకు జిల్లాలో వ్యాపారం సాగుతుందని వ్యాపారుల అంచనా. వీటితో పాటు లేడీస్ కార్నర్లు, టైలరింగ్ షాపుల వారు, ఇతర వ్యాపారులకు కూడా పండగ కలిసి వస్తోంది. ఆన్‌లైన్ కొనుగోళ్లూ పెరుగుతున్నాయి.



ఇచ్ఛాపురం మార్కెట్‌లో కిక్కిరిసిన జనాలు

ఆర్టీసీకి ఆదాయం..

ఆర్టీసీకి మిగతా రోజుల కంటే ఈ సీజన్‌లో ఆదాయం పెరుగుతోంది. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ వంటి పట్టణాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది. జిల్లాలో టెక్కలి, పలాస, శ్రీకాకుళం రెండు డిపోలకు కలిపి సగటున రోజుకు రూ.30 లక్షల వరకు ఆదాయం వస్తుంది. సంక్రాంతి సీజన్‌లో ఇది రెట్టింపు అవుతుంది. ప్రైవేటు ట్రావెల్స్ వారు ఆదాయం పెంచుకునేందుకు అదనంగా సర్వీసులను నడుపుతున్నారు. జిల్లా నుంచి విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, హైదరాబాద్ వంటి పట్టణాలకు స్పెషల్ సర్వీసులను నడుపుతున్నారు. ఇవి కూడా పెద్ద మొత్తంలో ఆదాయాన్ని కళ్ల చూస్తున్నాయి.



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ఇచ్ఛాపురం మార్కెట్ కిటకిట

ఇచ్ఛాపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మార్కెట్‌లో సంక్రాంతి శోభ కనిపించింది. వస్త్ర, బంగారం, పాదరక్షలు తదితర దుకాణాల్లో అమ్మకాలు జోరుగా సాగాయి. ఫుట్‌పాత్‌లపైనే కొందరు వ్యాపారాలు చేశారు. కిరాణాషాపులు కొనుగోలు దారులతో నిండిపోయాయి. పట్టణ ప్రధాన రహదారులు రద్దీగా మారాయి.

కొనుగోళ్లు బాగున్నాయి..



ఈ ఏడాది పండుగకు 20 రోజుల ముందు నుంచే వ్యాపారాలు బాగున్నాయి. రైతుల నుంచి కొనుగోళ్లు బాగున్నాయి. గతంతో పోల్చుకుంటే 30 శాతం మేరకు వ్యాపారాలు వృద్ధిచెందాయి.

- కె.మురళీ కృష్ణ, షాపింగ్ మాల్, యాజమాని, నరసన్నపేట

ఎక్కువగా డెలివరీ చేస్తున్నాం



ఆన్‌లైన్ వ్యాపారాలు బాగా పెరిగాయి. పది రోజుల నుంచి ఎక్కువగా డెలివరీ చేస్తున్నాం. ఈ సంక్రాంతికి దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు గృహోపకరణాలు బాగా కొనుగోలు చేస్తున్నారు.

- సీహెచ్ శివశంకర్, డెలివరీ.కామ్ సూపర్‌వైజర్, నరసన్నపేట

బెండికొండ మాది!

(ఏడో పేజీ తరువాయి)

లోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం జగనన్న ఇళ్ల కాలనీకిగానూ ఈ భూములు స్వాధీనం చేసుకుంది. వాస్తవానికి పాఠశాలకు మంజూరు చేసిన భూములు ఇతర అవసరాలకు వినియోగించే అవకాశం లేదు. అయినప్పటికీ వైసీపీ నాయకుల ఒత్తిడికి అధికారులు తలొగ్గారు. ఈ భూములు కూడా కొంతమేర ఆక్రమణదారుల స్వాధీనంలో ఉన్నాయి. కాగా.. కొన్నాళ్ల తర్వాత గురుకుల పాఠశాల కోసం కొండపై 10 ఎకరాలను అధికారులు కేటాయించారు. ఈ భూమిని ఇంతవరకూ గురుకుల పాఠశాల సిబ్బంది స్వాధీనం చేసుకోలేదు. దీంతో ఈ భూములపై కూడా ఆక్రమణదారుల కన్ను పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంత భారీస్థాయిలో బెండికొండ ఆక్రమణకు గురవుతున్నా.. అటవీ, రెవెన్యూశాఖల అధికారులు కనీసం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి నేతలు, అధికారులు స్పందించి బెండి భూములు సర్వే చేయించి.. ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. పేదలకు ఈ భూములు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆక్రమణలు తొలగించాలి



బెండికొండపై విలువైన భూములు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు గురయ్యాయి. ఆక్రమణదారుల్లో బడా నాయకులు ఉన్నారు. అప్పట్లో కొండపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని అధికారులను అనేకసార్లు వినతులు అందించాం. కానీ స్పందించ లేదు. ఇప్పటికైనా అధికారులు సమన్వయంతో బెండికొండ భూములను సర్వే చేయించి ఆక్రమణలు తొలగించాలి. ఈ భూములను పేదలకు పంచాలి.

- మరడ ధుర్యోధనరెడ్డి, టీడీపీ తెలుగు యువత మండల అధ్యక్షుడు, వజ్రపుకొత్తూరు

'పాలవలస' కన్నుమూత

(ఏడో పేజీ తరువాయి)

1962-67 మధ్య ఉనుకూరు ఎమ్మెల్యేగా పనిచేశారు. రాజశేఖరం సర్పంచ్ పదవి నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా పార్లమెంటు సభ్యుడి స్థాయి వరకు చేరుకున్నారు. నీలానగరం సర్పంచ్‌గా 1970-74 మధ్య పదవి చేపట్టారు. అనంతరం అప్పటి ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిలాల పరిషత్తు చైర్మన్‌గా 1974 నుంచి 1976 వరకు పనిచేశారు. ఆతర్వాత 1976లో రాజ్యసభ సభ్యుడిగా పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. 1992-94 మధ్యకాలంలో శ్రీకాకుళం డీసీసీబీ అధ్యక్షునిగా పనిచేశారు. 1994లో ఉనుకూరు అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మరలా 2006 నుంచి 2011 వరకు శ్రీకాకుళం జిల్లా పరిషత్ అధ్యక్షుడిగా సేవలందించారు. 2011 జూన్‌లో వైసీపీలో చేరారు.

ప్రకృతి సోయగాలు.. చరిత్ర ఆనవాళ్లు

- నేటి నుంచి సంగమేశ్వరుని జాతర
- తరలిరానున్న వేలాది మంది భక్తులు

ఆమదాలవలస, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సోయగాల నడుమ కొలువైన సంగమేశ్వర స్వామికి దశాబ్దాల చరిత్ర ఉంది. ఆమదాలవలస మండలానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గాజులకొల్లివలస సమీపంలో సంగమేశ్వర కొండ ఉంది. ఇక్కడ కొలువైన సంగమేశ్వరస్వామి 12వ శతాబ్ద కాలం నుంచి పూజలు అందుకున్నట్లు చరిత్ర చెబుతోంది. ఇక్కడ జైన, బౌద్ధ, శైవధర్మాలకు చెందిన ఆనవాళ్లు కనిపిస్తాయి. కొండపైన గుహలో కొలువైన సంగమేశ్వరస్వామిని దర్శించుకోవాలంటే 164 మెట్లు ఎక్కాలి. అనంతరం ఇరుకైన మార్గంగుండా లోపలకు ప్రవేశించి స్వామివారిని దర్శించుకోవాలి. ఇది నిజంగా సాహసోపేతం అనిపిస్తుంది. కొండ చివరి భాగానికి చేరుకోవాలంటే సాహసోపేతమైన ట్రెక్కింగ్ చేయాల్సి ఉంటుంది. అక్కడి నుంచి చూస్తే చుట్టుపక్కల కనిపించే ప్రకృతి అందాలు మధురానుభూతిని కలిగిస్తాయి. ప్రతి ఏటా సంక్రాంతికి ఇక్కడ జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాదికి సంబంధించి మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే జాతరకు సర్వం సిద్ధమైంది. ఈ జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి సంగమేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ఈ మూడు రోజులూ ఎటుచూసినా జనసంద్రమే కనిపిస్తుంది. చిరు వ్యాపారులు కుటుంబ సమేతంగా తరలివచ్చి ఇక్కడే గుడారాలు వేసుకుని వ్యాపారాలు చేసుకుంటారు. యువత కేరింత నడుమ జాతర కన్నుల పండువగా సాగనుంది.




ఏర్పాటు చేసిన జయింట్ వీల్

ఆధ్యాత్మిక పరిమళం.. ఏకశిలా పర్వతం

- నేటి నుంచి మెట్టవలస పర్వతంపై ఉత్సవాలు

జి.సిగడాం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మెట్టవలస ఏకశిలా పర్వతంపై ఉన్న మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణ ఆధ్యాత్మిక పరిమిళాలు వెదజల్లుతుంది. ఈ ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. గ్రామానికి ఈశాన్యంలో సహజ సిద్ధంగా వెలసిన ఏకశిలా పర్వతంపై గల శివలింగానికి శతాబ్దాల చరిత్ర ఉంది. రాజాం- శ్రీకాకుళం ప్రధాన రహదారికి కూతవేటు దూరంలో ఉన్న ఈ ఆలయాన్ని సంక్రాంతి, కార్తీకమాసంలో భక్తులు భారీగా తరలివస్తారు. ముఖ్యంగా సంక్రాంతి నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయి. ఇక్కడి స్వామివారిని దర్శించుకోవాలంటే 220 మెట్లు ఎక్కాల్సిందే. కొండపై భాగంలో శివాలయానికి దగ్గరలో పాతాళబావి ఉంది. అన్ని కాలాల్లోనూ ఇక్కడ జలకళ ఉండడం విశేషం. ఇక్కడి స్వామివారిని దర్శించుకుంటే అవివాహితులకు తక్షణమే వివాహాలు జరుగుతాయని స్థానికుల నమ్మకం. కొండపై భాగం నుంచి చుట్టూ కపిపించే దృశ్యాలు పర్యాటకులను కనువిందు చేస్తాయి. సాధారణంగా శివాలయం ద్వారం తూర్పునకు అభిముకంగా ఉంటుంది. శతాబ్దాల కిందట శివనాగేశ్వరాలయం (కళ్లేపల్లి), మణినాగేశ్వరాలయం (పెద్దకళ్లేపల్లి) శైలిలోనే ఈ ఆలయం కూడా ఉండడంతో వాటివల్లే శతాబ్దాల కిందటే నిర్మించి ఉంటారని స్థానికులు చెబుతున్నారు.



కొండపై పాతాళగంగ బావి



కొండపై వెలసిన శివలింగం

మొగలి పరిమళాలు ఏవీ?

(ఏడో పేజీ తరువాయి)

సేకరిస్తారు. ఒక్కోచెట్టుకు వందల్లో పూలు పూస్తాయి. ఒక్కో పువ్వు రూ.10నుంచి రూ.12 వరకూ పలుకుతుంది. అయితే మొగలిపువ్వుల సేకరణ అనేది కత్తిమీద సాము. చెట్టుకొమ్మన పువ్వు పూస్తుంది. మొగలి చెట్లు గుబురుగా ఉంటాయి. పైగా ఆకులకు ముళ్లు ఉంటాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న రంపం మాదిరిగా దాని ముళ్లు కోస్తాయి. దీనికితోడు మొగలి చెట్లపై పసరిక పాములు సంచరిస్తుంటాయి. మరోవైపు ఉద్దానంలో గుబురుగా ఉండే మొగళి చెట్ల మధ్య ఎలుగుబంట్లు సేదదీరుతుంటాయి. ఇన్ని ప్రమాదాల మధ్య మొగలి పువ్వులు సేకరించినా ఆశించిన స్థాయిలో గిట్టుబాటు కావడం లేదని రైతులు, కార్మికులు వాపోతున్నారు. వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధినిస్తున్న మొగలిని వాణిజ్య పంటగా గుర్తించాలని కోరుతున్నారు.

బెలగాంలో రక్తదాన శిబిరం

కవిటి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఏపీజే అబ్దుల్‌కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెలగాం ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఉద్దానం బ్లడ్‌బ్యాంక్ వారి సౌజన్యంతో ఫౌండేషన్ సభ్యులు 11 మంది యువకులు రక్తదానం చేశారు.

కికెట్ పోటీల విజేత మజ్జిలపేట

పొందూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీ జోగన్నపేటలో సర్వోదయ యువజనసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలో మజ్జిలపేట జట్టు విజేతగా నిలిచింది. నాలు గు రోజులుగా ఈ పోటీలు జరుగుతున్నాయి. సోమవారం జరిగిన ఫైనల్‌లో మజ్జిలపేట, పొందూరు జట్లు తలపడ్డాయి. మజ్జిలపేట విన్నర్‌గా, పొందూరు రన్నరప్‌గా నిలిచాయి. విజేత జట్టుకు తండ్యాం ఎంపీటీసీ ప్రతినిధి వడగా మోహన్‌రావు, టీడీపీ నాయకులు ఆదినారాయణ మెమొంటోలను అందించారు.

పాడి పరిశ్రమతో రైతులకు మేలు

● ఎమ్మెల్యే కూన రవికుమార్

బూర్జ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధితో రైతులకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని డొంకలపర్త గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మినీ గోకులం (గోశాల)ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిందని, ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పించలేదని ఆరోపించారు. ప్రస్తుతం ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసి తీరుతామన్నారు. డొంకలపర్తలో ఆరు నెలల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ఈ గ్రామం నుంచి పాలకొండలో విద్యార్థులు చదువుతున్నారని, రాత్రిపూట వచ్చేసమయంలో చీకటి అవుతుందని ఎమ్మెల్యే దృష్టికి కొంతమంది మహిళలు తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన మూడు నెలల్లో ఈ గ్రామం నుంచి పాలకొండ ప్రధాన రహదారి వరకు వీధిదీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. బలగ స్వామినాయుడు జాతి స్థాయిలో స్విమ్మింగ్‌లో సౌత్‌జోన్‌లో ప్రథమ స్థానం సాధించినందుకు ఎమ్మెల్యే, కూటమి నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రామకృష్ణనాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

శ్వేతగిరి అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే శంకర్

గార, జనవరి 13(ఆంధ్రజ్యోతి): శ్వేతగిరి (శాలిహుండం) అభివృద్ధికి కృషి చేయనున్నట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. వచ్చే నెల 7వ తేదీ నుంచి 10 వరకు జరగనున్న వేణుగోపాల స్వామి వార్షిక కల్యాణం, యాత్రకు సంబంధించిన కరపత్రాల్ని ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ క్షేత్రం పర్యాటక కేంద్రంగా ఎంతగానో ఆకట్టుకుంటుందని, మరింత అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ట్రస్ట్ బోర్డు చైర్మన్ సుగ్గు మధురెడ్డి ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, మాజీ ఎంపీపీ గుండ భాస్కరరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బడగల వెంకట అప్పారావు పాల్గొన్నారు. అలాగే శ్రీకూర్మం పంచాయతీ అయ్యవారిపేటలో గోకులాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

వెల్లివెరిసిన సేవా భావం

● పేదలకు వస్త్రాల పంపిణీ



ఎచ్చెర్ల: అజ్జరాంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనివాసరావు

జి.సిగడాం/ఎచ్చెర్ల, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వేళ జి.సిగడాం మండలం దవళపేట, ఎచ్చెర్ల మండలం అజ్జరాం, కేకే నాయుడుపేటలో సేవా భావం వెల్లివెరిసింది. దవళపేటలో పీవీఎస్ ఫౌండేషన్ చైర్మన్ పేడాడ రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి, ఆరోగ్యానికి, పేదల అభ్యున్నతికి ఎల్లప్పుడూ ముందుంటానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పేడాడ వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు. ● అజ్జరాం గ్రామంలో ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ బోర శ్రీనివాసరావు, కేకేనాయుడుపేటలో ఏఎంసీ మాజీ చైర్మన్ జీరు రామారావు పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. పరిసర గ్రామాలకు చెందిన వందలాది మందికి వీటిని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత బోర రాము, సర్పంచ్ జీరు వెంకటమ్మ, మాజీ సర్పంచ్ జీరు అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




జి.సిగడాం: దవళపేటలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న రామ్మోహన్‌రావు

రేపటి నుంచి గెడ్డకంచరాం పైడితల్లి జాతర

జి.సిగడాం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి చెందిన గెడ్డకంచరాం పైడితల్లి అమ్మవారి జాతర బుధవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తదితర జిల్లాల నుంచి వేలాదిమంది భక్తులు తరలిరానున్నారు. ఈ మూడు రోజులపాటు పందిర పాటలు, వినోద, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పౌరాణిక, సాంఘిక నాటకాలు ప్రదర్శించనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది అమ్మవారికి ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. ఉత్సవ విగ్రహాన్ని అమ్మవారి వనం నుంచి గ్రామంలోకి తీసుకువెళ్లి పురవీధుల్లో ఊరేగించనున్నారు. అనంతరం అమ్మవారిని వనంకు తీసుకువెళ్లి యాత్రను ప్రారంభిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

శివానంద గిరి కొండపై ముగ్గుల పోటీలు

ఇచ్ఛాపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): త్రినాథ స్వామి కొలువైన బెల్లుపడ శివానందగిరి కొండపై సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. దాదాపు వంద మంది చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన కె.మోహిని, యు.కుమారి, ఎం.నీతులకు బహుమతులు అందించారు. నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచిన పి.ధనలక్ష్మి, జి.నిషాలకు కన్సొలేషన్ బహుమతులు అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, గ్రామ పెద్దలు ఆశి జీవులురెడ్డి, దుర్గాశి పాపారావు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న ముగ్గు

రథసప్తమి ఏర్పాట్ల పరిశీలన

అరసవల్లి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఫిబ్రవరిలో జరగనున్న రథసప్తమి కోసం చేపడుతున్న ఏర్పాట్లను సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే గొండు శంకర్ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

శ్రీముఖలింగేశ్వరుని సేవలో తెలంగాణ హైకోర్టు జడ్జి

జలుమూరు, జనవరి 13: (ఆంధ్రజ్యోతి) దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలోని శ్రీ ముఖలింగేశ్వరస్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనపమ చక్రవర్తి కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం వారి గోత్ర నామాలతో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించారు. అనంతరం శేషవస్త్రాలు అందించి ఆశీర్వదించారు. ఆలయ విశిష్టతతో పాటు పురాణ గాథను అర్చకులు వివరించారు. వారితో పాటు ఆలయ ఈవో పి.ప్రభాకరరావు ఉన్నారు.



స్వామి సన్నిధిలో జస్టిస్ అనపమ చక్రవర్తి

చిన్ననాటి జ్ఞాపకాలతో..

● 25 ఏళ్లుగా స్నేహపూర్వక క్రికెట్ పోటీ



ఆర్ట్స్ కళాశాల మైదానంలో కలిసిన స్నేహితులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): వారంతా చిన్ననాటి స్నేహితులు. ఒక్కదగ్గరే క్రికెట్ ఆడేవారు. పెద్దయ్యాక వారంతా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అయినా క్రికెట్‌పై మక్కువ వదల్లేదు. ఏటా భోగి రోజున వారంతా వచ్చి క్రికెట్ ఆడుతుంటారు. గత 25 ఏళ్లుగా స్నేహపూర్వక క్రికెట్ పోటీ సమ్మేళనాన్ని నిర్వహించుకుంటున్నారు. ఈ ఏడాది కూడా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలో సోమవారం స్నేహపూర్వక క్రికెట్ పోటీ నిర్వహించారు. ఆడేందుకు ఓపిక లేకపోయినప్పటికీ, రిటైర్డ్ అయిన ఉద్యోగులు సైతం కాళ్లకు ప్యాడ్ కట్టుకుని బ్యాటింగ్ చేశారు. పరిగెడుతూ బౌలింగ్ చేశారు. వారిని చూసి వీక్షకులు మురిసిపోయారు. ఈ సమ్మేళనంలో డీఎస్పీలు బుచ్చిరాజు, ఇలియాస్ మహ్మద్, చార్టడ్ అకౌంటెంట్ వి.మురళీమోహన్, డాక్టర్ సువ్వారి రవి, క్రికెట్ సంఘం ట్రెజరర్ షైలాని, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి బి.మురళీధరకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు టెంట్లు

ఈ చిత్ర చూస్తున్నారుగా.. ఇదేదో మార్కెట్ అనుకుంటే పొరపాటే.. సంక్రాంతి నేపథ్యంలో మద్యం దుకాణాల వద్ద టెంట్లు ఏర్పాటు చేసి మద్యం విక్రయం చేపడుతున్నారు. మెళియాపుట్టిలోని ఓ షాపు వద్ద మద్యంప్రియులకు ప్రత్యేకంగా సౌకర్యాలు ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం దుకాణాల వద్ద మద్యం సేవించకూడదు. అయితే ఇవేవీ పట్టించుకోకుండా మద్యాన్ని ప్రత్యేక ఏర్పాటు చేసి విక్రయించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



-మెళియాపుట్టి

మహాలక్ష్మికి గంగాహారతి



హారతి ఇస్తున్న భక్తులు

కంచిలి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కంచిలి మండలం కర్తలి గ్రామంలో వెలసియున్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గంగా హారతి ని భక్తులు సోమవారంమ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

వెంకటస్వామికి రోటరి పురస్కారం

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంఘ సేవకులు, పాల్‌హరీస్ ఫెలో రొటేరియన్ మంత్రి వెంకటస్వామికి రోటరీ క్లబ్ (శ్రీకాకుళం) సోమవారం అరసవల్లిలో రోటరీ పురస్కారం అందించింది. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ముని శ్రీనివాస్, కార్యదర్శి దూసి సంతోష్, కోశాధికారి పసగాడ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


అప్పారావు మృతదేహం

టెక్కలి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు సమీపంలో జాతీయరహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివ రాలిలా ఉన్నాయి. పెద్దసాన గ్రామానికి చెందిన బందావు అప్పారావు (50) రోడ్డు పక్క నుంచి వెళ్తున్న సమయంలో శ్రీకాకుళం నుంచి పలాస వైపు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ వాహనం ఢీకొని ఈ ప్రమాదం జరిగింది. గాయ పడిన అప్పారావును జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినప్పటికే మృతి చెంది నట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ..

పాతపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కాలినగాయాలతో శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ రవ్వ కృష్ణారావు(57) సోమవారం మృతిచెందినట్లు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. స్థాని క ఉప్పర వీధికి చెందిన కృష్ణారావు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. కాగా మృతుడి భార్య రోజా ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఎస్ఐ బి.లావణ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు


రెండు ముక్కలైన ద్విచక్రవాహనం

శ్రీకాకుళం క్రైం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): నగర సమీపంలోని పెద్దపాడు రోడ్డు ఓ కారు షోరూం ఎదురుగా సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. రూరల్ పోలీసులు తెలి పిన వివరాల మేరకు.. గార మండలం కొమరవానిపేటకు చెందిన మురమండ రాజా అనే 28 ఏళ్ల యువకుడు విశాఖ-ఎ కాలనీ నుంచి పెద్ద పాడు వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొనడంతో ఆ యువకుడి తలకు బలమైన గాయాలు కావడంతో తీవ్ర రక్తస్రావం అయింది. స్థానికులు సమాచారం మేరకు చేరుకున్న 108 వాహనంలో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు అక్కడి నుంచి కిమ్స్‌కు తరలించారు. ఆ యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. కాగా ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం రెండు ముక్కలైంది. విషయం తెలుసుకున్న రూరల్ స్టేషన్ ఎస్ఐ వాసుదేవరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నాటి ఉపాధ్యాయులతో విద్యార్థులు

నందిగాం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నందిగాం ఉన్నత పాఠశాలలో 2005-06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. పాఠశాలలో నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందం పొందారు. అప్పటి ఉపాధ్యాయులు ఎన్.ఢిల్లేశ్వర రావు, కె.అచ్యుతరావు, సుభాషిణి, కె.హేమలత, మోహనరావులను సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మదన్ గౌడ్, యు.రామారావు, కె.శంకర రావు, పి.గౌతమి, పి.చక్రధర్ తదితరులు పాల్గొన్నారు. ● నందిగాం ఉన్నత పాఠశాలలో 1996-97 సంవత్సరంలో పదో తరగతి చదివిన శాసనపురి చిన్నబాబు మృతి చెందడంతో తోటి విద్యార్థులు ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు సోమవారం మృతుడి స్వగ్రామం లకిదాసుపురం వెళ్లి ఆయన కుటుంబానికి రూ.2 వేలు సాయం అందించారు.

పేదలకు దుస్తులు, నిత్యావసరాల పంపిణీ


పేదలకు దుస్తులు అందిస్తున్న సంఘ నాయకులు

పలాస, జనవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక వైశ్యసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భోగి, సంక్రాంతి సందర్భంగా 600 మంది పేదలకు దుస్తులు, రూ.1000 విలువైన నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు మల్లా కృష్ణారావు మాట్లాడుతూ.. ప్రతిఏటా ఈ కార్య క్రమం నిర్వహిస్తున్నామని, పర్వదినాల్లో పేదలు పస్తులు ఉండకూడదన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు మల్లా భాస్కరరావు, కార్య దర్శి తంగుడు వైకుంఠరావు, మల్లా బాబూరావు, డోకి నాగేశ్వరరావు, కోట్ని శశి, వైకుంఠరావు పాల్గొన్నారు.

రోడ్డుపై ఏర్పడిన రంధ్రం పూడ్చివేత



రంధ్రాన్ని కప్పిన దృశ్యం

వజ్రపుకొత్తూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పూండిగల్లి సమీపంలో రోడ్డుపై ఏర్పడిన రంధ్రాన్ని సంబంధిత అధికారులు గ్రావెల్, క్రషర్ బుగ్గి వేసి కప్పారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రమాదకరం' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనికి ఆర్అండ్ బీ అధికారులు స్పందించి రంధ్రాన్ని పూడ్చడంతో వాహనదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

కాశీ విశ్వేశ్వరస్వామి గ్రామోత్సవం

జలుమూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కరవంజ గ్రామంలో కొలువు తీరిన కాశీ విశ్వేశ్వరస్వామి గ్రామోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ 5వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి జిల్లా స్థాయి బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా అంతటా సంక్రాంతి శోభ

- పట్టణాల్లో మార్కెట్లు కిటకిట
- క్రీడా పోటీలతో యువతలో ఉత్సాహం
- గ్రామాల్లో సాంస్కృతిక సందడి


హరిపురం: అల్లిమెరక గ్రామంలో జరుగుతున్న వాలీబాల్ పోటీలో పాల్గొన్న యువకులు

టెక్కలి/పాతపట్నం/పలాస రూరల్/హరిపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి శోభ పట్టణాలు, పల్లెలకు తాకింది. ఆదివారం వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా స్వగ్రామాలకు తరలి రాగా సోమవారం భోగి వేడుకలను నిర్వహించి ఆనందం పొందారు. సంక్రాంతికి అవసరమైన కొత్త దుస్తులు, సామగ్రిని కొనుగోలు చేసుకునేందుకు సమీపంలోని పట్టణాలకు గ్రామీణులు తరలిరావ డంతో పట్టణాల్లోని వీధులన్నీ కిటకిటలాడాయి. వస్త్ర దుకాణాలు, కిరాణా, కూరగాయలు, ఫ్యాన్సీ స్టోర్సులు రద్దీగా కనిపిం చాయి. ఆర్టీసీ బస్సులు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిట కిటలాడాయి. ఈ సందర్భంగా గ్రామాల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. గాలిపటాలు ఎగురవేత, మహిళలకు టాగ్ ఆఫ్ వార్, రంగవల్లికల పోటీలను నిర్వహించారు. అలాగే యువతకు క్రికెట్, వాలీబాల్ పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు. అలాగే వివిధ కళారూపాల ప్రదర్శన నిర్వహించారు. గంగిరెద్దుల విన్యాసాలు, బాల బాలికల జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

పాతపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పెద్దసీది జడ్పీ హైస్కూల్ ఆవరణలో గ్రామ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. సుమారు 85 మంది మహిళలు పాల్గొని రంగవల్లులను వేశారు. విజేతలకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నగదు పురస్కారం, జ్ఞాపికలను అందించారు. పలువురు నిర్వాహకులు పాల్గొన్నారు.


పాతపట్నం: ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


నరసన్నపేట: మబుగాంలో భోగి పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కుటుంబ సభ్యులు

ఎమ్మెల్యేల ఇంట భోగి సందడి

పలాస/నరసన్నపేట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భోగి పర్వదినం సందర్భంగా సోమవారం టీడీపీ ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి ప్రత్యేక పూజలు చేసి భోగి మంట వేసి ఆనందం వ్యక్తం చేశారు. పలాసలో ఎమ్మెల్యే గౌతు శిరీష, యార్లగడ్డ వెంకన్నచౌదరి దంపతులు, మబుగాంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దంపతులు, కుటుంబ సభ్యులతో కలిగి భోగి వేడుకలో పాల్గొన్నారు. పారశెల్లి గ్రామంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే రమణమూర్తి పాల్గొని క్రీడాకారులకు బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యేలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.


పలాస: భోగి పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష, వెంకన్న చౌదరి దంపతులు


హరిపురంలో డూడూ బసవన్నల సందడి


నందిగాం: భోగి మంట వద్ద యువకులు


ఎచ్చెర్ల: దేవీ ఆశ్రమంలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న బాలభాస్కరశర్మ


రణస్థలంలో దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పిన్నింటి భానోజీరావు

రబీకి వంశధార నీటిని విడుదల చేయండి

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగునీటిని సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నీటిపారుదల శాఖ అధికారులు, వంశధార ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడారు. రబీ సీజన్ అవసరాలను దృష్టిలో ఉంచు కొని వెంటనే నీటిని విడుదల చేయాలని సూచిం చారు. ప్రస్తుతం నీటి నిల్వ రైతులకు ఉప యోగ పడేలా చేయాలన్నారు. ఈ నీటని ఆరుతడి పంటలకు వినియోగించుకోవాల న్నారు. వంశధార నీరు వృథాగా విడిచిపెట్ట కుండా సద్వినియోగం చేసుకుందామన్నారు. అనంతరం నిమ్మాడ రైతులకు అవసరమైన వంశధార సాగునీటిపై సంబంధిత అధికారులతో మాట్లాడారు.

అభివృద్ధిపథంలో నియోజకవర్గం: శిరీష

- రూ.లక్ష చొప్పున నగదు ప్రోత్సాహకం


పలాస: 23వ వార్డు టీడీపీ నేతలకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస/వజ్రపుకొత్తూరు/హరిపురం/పలాస రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): తనను నమ్ముకున్న కార్యకర్తలకు అండగా ఉంటానని, వారి ఆశలను వమ్ముచేయనని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో అత్యధిక మెజార్టీ ఇచ్చే వార్డులు, గ్రామాలకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందిస్తానని ఇచ్చిన హామీని ఆమె నిలబెట్టుకున్నారు. సంక్రాంతి నేపథ్యంలో సోమవారం పలాస మునిసిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావుతో వజ్రపుకొత్తూరు మండలం పల్లివూరు, మందస మండలం నారాయణపురం, పలాస మండలం లక్ష్మీపురం పంచాయతీల నేతలకు ప్రోత్సాహక నగదును అందజేశారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడుపుదామన్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి మాట్లాడుతూ.. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఈనెల 22న రక్తదాన శిబిరంలో 1000 యూనిట్లు లక్ష్యంగా పెట్టుకున్నామని, కార్యకర్తలు లక్ష్యం చేరువకు సహకరించాలని కోరారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే దువ్వాడ నాగావళి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, ఆ పార్టీ నేతలు లొడగల కామేశ్వరరావు యాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, దువ్వాడ సంతోష్, వసంతరావు, సూరాడ మోహనరావు, కర్ని రమణ, బావన దుర్యోధన, దాసరి తాతారావు, జీకే నాయుడు, రట్టి లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

పండగ రోజుల్లో ట్రాక్ పనులా?


తిలారు రైల్వేగేటు వద్ద రైల్వే ట్రాక్ పనులు చేపడుతున్న సిబ్బంది

జలుమూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) ప్రయాణికుల రద్దీ ఉండే పండగ రోజుల్లో తిలారు రైల్వే గేటు వద్ద రైల్వే ట్రాక్ పనులను అధికారులు చేపట్టడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాది పొడవునా రైల్వే ట్రాక్ పనులు చేపట్టకుండా పండగ రోజుల్లో చేపట్టడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. చల్లవానిపేటకు నరసన్నపేటకు మధ్యలోని తిలారు రైల్వే గేటు వద్ద ట్రాక్ పనులు రైల్వే అధికారులు సోమవారం చేపట్టారు. దీంతో నరసన్నపేట నుంచి వచ్చే వాహనాలు జమ్ము కూడలి నుంచి నిమ్మాడ మీదుగా చల్లవానిపేటకు, సారవకోట నుంచి వచ్చే వాహనాలు చల్లవానిపేట కూడలి నుంచి జర్జంగి మీదుగా నరసన్నపేటకు రూటు మళ్లించారు. దీంతో సంక్రాంతికి వచ్చే ప్రజలు స్వగ్రామాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెద్ద వాహనాలు మాత్రం జర్జంగి మీదుగా దారి మళ్లించారు.

న్యూస్ బాక్స్

భోగి మంటలో విద్యుత్ బిల్లులు వేసి నిరసన

టెక్కలి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను వ్యతిరేకిస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం భోగి మంటల్లో బిల్లులను వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు సంబూరు షణ్ముఖరావు మాట్లాడుతూ.. స్మార్ట్‌మీటర్ల బిగింపు నిలుపుదల చేసి పెంచుతున్న విద్యుత్ చార్జీలను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులకు బహుమతులు

నరసన్నపేట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): హెచ్‌పీ గ్యాస్ గోల్డెన్ జూబ్లీ క్యాంపింగ్‌లో భాగంగా స్థానిక రామలింగంనాయుడు గ్యాస్ ఏజెన్సీలో సోమవారం గ్యాస్ వినియోగదారుల కూపన్లను ఏపీపీ గొండు సత్యనారాయణ డ్రా తీశారు. డి. భూదేవి (అల్లాడ-ప్రథమ) ఎల్ఈడీ టీవీ, టి.ఆదిలక్ష్మి (మామిడివలస-ద్వితీయ)వాటర్ ప్యూరిఫైర్, గంగరాపు వెంకట్రావు (రావులవలస-తృతీయ) గ్రైండర్ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో ధర్మాన రామదాస్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

- ముగిసిన ధనుర్మాసోత్సవాలు

గడచిన నెలరోజులుగా వైష్ణవ ఆలయాల్లో నిర్వహించిన ధనుర్మాసోత్సవాలు సోమవారం గోదా రంగనాథుల కల్యాణంతో ముగిశాయి. నెలరోజుల పాటు ప్రతిరోజూ తెల్లవారు జామున ప్రత్యేక పూజలు, తిరుప్పావై ప్రవచనాలతో పాటు ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ ఉత్సవాల ముగింపు సందర్భంగా టెక్కలి, నరసన్నపేట, వజ్రపుకొత్తూరు, మందస, నందిగాం, ఇచ్ఛాపురం, కవిటి, జి.సిగడాం, జలుమూరు మండలాల్లోని పలు ఆలయాల్లో గోదాదేవి రంగనాథుల కల్యాణం కమనీయంగా సాగింది. పలువురు భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

-ఆంధ్రజ్యోతి బృందం


నరసన్నపేట: వేంకటేశ్వర స్వామి ఆలయంలో..


వజ్రపుకొత్తూరు: రిట్టపాడు వేంకటేశ్వర ఆలయంలో..


నందిగాం: పెంటూరులో...



కవిటి: బెజ్జిపుట్టుగలో గోదాదేవి కల్యాణం


జి.సిగడాం: సంతవురిటిలో గోదా రంగనాథుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు


జలుమూరు: శ్రీముఖలింగేశ్వరాలయం క్షేత్రపాలకుడు విష్ణుమూర్తికి పూజలు


నందిగాం: సుబ్బమ్మపేటలో..


ఇచ్ఛాపురం: పెద్ద జగన్నాథ స్వామి ఆలయంలో..


మందస: వాసుదేవుని ఆలయంలో..